సాక్షి తిరుపతి

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023




శేషాచలంలా వసంతమండపం

శ్రీవారి వసంతోత్సవాల్లో భాగంగా తిరుమలలోని వసంత మండపాన్ని శేషాచలం అడవులను తలపించేలా తీర్చిదిద్దారు. - 8లో



నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర జరగనుంది.



పన్ను వసూళ్లలో తిరుపతి ఫస్ట్

పన్నుల వసూళ్లలో తిరుపతి కార్పొరేషన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈనేపథ్యంలో మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అధికారులను, సిబ్బందిని అభినందించారు. - 8లో



న్యూస్‌రీల్

వసంతోత్సవాలకు అంకురార్పణ



వసంతోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమంలో అర్చకులు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వార్షిక వసంతోత్సవాలకు సోమవారం రాత్రి వేదపండితులు అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. దేవస్థాన ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి మాట్లాడుతూ స్వామివారికి వేసవితాపాన్ని తగ్గించేందుకు చైత్రమాసం వసంతరుతువులో వసంతోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. వసంతోత్సవాలు విజయవంతమయ్యేందుకు పుట్ట మట్టిని తీసుకువచ్చి అందులో నవధాన్యాలు కలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్సంగ్రహణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

అప్రెంటిస్‌షిప్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వీ.శ్రీలక్ష్మి తెలిపారు. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియాలో భాగంగా నిర్వహించే అప్రెంటిస్‌షిప్ మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారికి అప్రెంటిస్‌షిప్ అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7995479269, 99595 53093, 77996 79351లో అప్రెంటిస్‌షిప్ సలహాదారు ఎం.సెల్వరాజ్‌ను సంప్రదించాలని కోరారు.

అర్జీలకు పరిష్కారం చూపండి



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని డీఆర్వో ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వోతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కోదండరామిరెడ్డి, భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 123 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే 80 వరకు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్ : కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి 6, 11 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు డీఈఓ వి.శేఖర్ తెలిపారు. అంతేగాకుండా 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. అనాథలు, బడిబయటి పిల్లలు, డ్రాపౌట్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బాలికలు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. ఇతర వివరాలకు 9441863994 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఆర్జిత సేవలు రద్దు

రాపూరు: పెంచలకోన దేవస్థానంలో మంగళవారం నుంచి గురువారం వరకు ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్లు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామికి మంగళవారం నుంచి గురువారం వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు చెప్పారు. తిరిగి శుక్రవారం నుంచి యథావిధిగా అన్ని సేవలు జరుగుతాయన్నారు.

పాలన పరుగు

❝
- మాది సత్యవేడు. నా పేరు షేక్ మస్తాని. గతంలో ఏదైనా సమస్య వచ్చి అధికారులకు ఫిర్యాదు చేయాలంటే చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. మూడు గంటలకుపైగా ప్రయాణం చేసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తిరుపతిలోనే కలెక్టరేట్ అందుబాటులోకి వచ్చింది. సచివాలయ వ్యవస్థ గ్రామంలోనే ఉంది. ఎలాంటి ఇబ్బందీ లేకుండా స్పందనలో అర్జీలిచ్చి సమస్యలు పరిష్కరించుకుంటున్నాం.
- మాది చంద్రగిరి. నా పేరు రమణప్ప. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గతంలో 103.5 కి.మీ దూరంలో ఉన్న చిత్తూరుకు వచ్చి అధికారులకు అర్జీలిచ్చేవాడ్ని. ఇప్పుడు తిరుపతి జిల్లా ఏర్పడింది. 15.8 కి.మీ దూరంలోని తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లి సమస్య పరిష్కరించుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

స్పందనలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు వచ్చిన అర్జీలు

నెల	వచ్చిన అర్జీలు	పరిష్కారమైన అర్జీలు	పెండింగ్‌లో ఉన్న అర్జీలు
ఏప్రిల్	949	949	0
మే	1117	1116	1
జూన్	1266	1266	0
జూలై	1176	1176	0
ఆగస్టు	1026	1026	0
సెప్టెంబర్	1173	1173	0
అక్టోబర్	978	977	1
నవంబర్	1015	1015	0
డిసెంబర్	1044	1044	0
జనవరి	1054	1021	33
ఫిబ్రవరి	814	776	38
మార్చి	920	497	423
మొత్తం	12,532	12,036	496

'పరిపాలన ప్రజలకు చేరువకావాలి. కార్యాలయాలు అందుబాటులోకి రావాలి. సిబ్బంది ప్రజలకు సత్వర సేవలందించాలి' అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాను చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలుగా విభజించింది. జిల్లాల పునర్విభజన తర్వాత పాలన పరుగులు పెడుతోంది. ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోంది. మరోవైపు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు మెరుగైన పాలన అందించే సౌలభ్యం కలిగింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ప్రజలకు మేలు
- ప్రజల్లో విశేష 'స్పందన'
- గుమ్మం ముందే పరిష్కారమవుతున్న సమస్యలు
- వేగవంతంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు

ఏడాది పాలనలో తిరుపతి జిల్లా ప్రజలకు కలిగిన లబ్ధి

- సంక్షేమ పథకాల ద్వారా 24,42,699 మందికి రూ.2,378.35 కోట్లు
- పేదలందరికీ ఇళ్లు – 73,723
- 48 గ్రామ సచివాలయ భవనాలకు – రూ.945 లక్షలు
- 40 రైతుభరోసా కేంద్రాల భవనాలకు – రూ.437 లక్షలు
- 29 వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణానికి – రూ.186 లక్షలు
- గడపగడపకు మన ప్రభుత్వం – 1,557 పనులకు రూ.53.24 కోట్లు
- నాడు–నేడు 1,070 పాఠశాలలకు – రూ.370.05 కోట్లు

❝
ఏడాదిలో మెరుగైన పాలన



శ్రీవేంకటేశ్వరుని పాదాల చెంత తిరుపతి నూతన జిల్లాగా ఏర్పాటు కావడం ఆనందంగా ఉంది. స్వామి వారి ఆశీస్సులతో తిరుపతి జిల్లాలోని ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను అందించి మెరుగైన పాలన అందిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో రూ.2,378 కోట్లు ఖర్చుపెట్టింది. అందరి సహకారంతో ఏడాదిలో ప్రజలకు సమర్థవంతంగా పరిపాలన అందించగలిగాం.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి



ఏర్పేడు మండలం, రాజులపాలెం వద్ద నిర్మాణంలో అల్యూమినియం ఫ్యాక్టరీ

సాక్షి, తిరుపతి: తిరుపతి నూతన జిల్లాగా ఏర్పాటు అయిన తర్వాత పారిశ్రామిక అభివృద్ధి వేగవంతమైంది. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉండడంతో పెట్టుబడుల ప్రవాహం పెరిగింది. జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయాలు చెన్నై, బెంగళూరు, తిరుపతి, సీ– పోర్టులు వంటి రవాణా సౌకర్యాలు మెరుగుపడడం తిరుపతి జిల్లాకు వరంగా మారింది. ఏపీఐఐసీ భూములు అందుబాటులో ఉండడం, వీసీఐసీ కారిడార్ భూసేకరణతో పారిశ్రామికంగా తిరుపతి జిల్లా అభివృద్ధికి దోహదపడుతోంది. గత ఏడాది జిల్లా ఏర్పడిన నాటి నుంచి 15 పెద్ద పరిశ్రమలు వచ్చాయి. మొత్తంగా రూ.5,409 కోట్ల పారిశ్రామిక పెట్టుబడులతో 1,835 మధ్య తరహా, చిన్న పరిశ్రమలు ప్రారంభించారు. 15,696 మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. రానున్న ఏడాదిలో మరో 14 పెద్ద పరిశ్రమలు, రూ.12,357 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. త్వరలో ప్రారంభానికి పలు పరిశ్రమలు సిద్ధమవుతున్నాయి. దీనివల్ల మరో 21,626 మందికి ఈ ఏడాది పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలగనున్నాయి.

50 ఎకరాల్లో స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీ

తిరుపతి జిల్లా ఏర్పాటయ్యాక 50 ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ పనులు చేపట్టారు. ఆ యూనివర్సిటీ ఏర్పాటుకు ఏర్పేడు మండలం, కోబాక వద్ద 50 ఎకరాల భూకేటాయింపులు చేశారు. స్కిల్ కళాశాల కోసం చంద్రగిరి నియోజకవర్గం, నాగపట్ల వద్ద 9.8 ఎకరాల భూమి కేటాయించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్స్‌ను ఏర్పాటు చేసేందుకు జిల్లాలో 8 హబ్‌లలో యువతకు శిక్షణ ఇస్తున్నారు. యువతకు శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

బతిమాలినా కనికరించలేదు

- లుంగీతో గొంతు బిగించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణ హత్య
- ఆపై కారులో వేసి దహనం చేసిన నిందితులు
- ఇప్పటికే కొంతమందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చాణక్యప్రతాప్ కోసం ముమ్మర గాలింపు

చంద్రగిరి: 'నా తమ్ముడు చేసిన తప్పునకు ఏ శిక్షనైనా విధించండి.. అంతేకానీ వాడిని చంపొద్దు..' అని అన్న నాగరాజు ఎంత బతిమాలినా కనికరించలేదు. లుంగీతో గొంతు బిగించి అతిదారుణంగా చంపేశారు. ఆపై కార్లో పడేసి సజీవ దహనం చేశారు. శనివారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నాగరాజు సజీవ దహనం కేసులో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. వెదురుకుప్పం మండలం, బ్రాహ్మణపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు నాగరాజు(35)ను అతికిరాతకంగా మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. పంచాయితీ పేరుతో రాజీ చేద్దామని పిలిపించిన టీడీపీ నాయకులు చాణక్యప్రతాప్, రిపుంజయ అతని అనుచరులు మానవత్వం మరిచి దారుణానికి ఒడిగట్టారు.

అసలేం జరిగిందంటే

సాఫ్ట్‌వేర్ ఇంజినీరు నాగరాజు తమ్ముడు పురుషోత్తంకు బ్రాహ్మణపల్లి సర్పంచ్ చాణక్యప్రతాప్ తమ్ముడు రిపుంజయ భార్యతో వివాహేతర సంబంధం నడుస్తోంది. విషయం తెలియడంతో వారిద్దరూ శివరాత్రి రోజున పురుషోత్తం, నాగరాజుతో గొడవకు దిగారు. అప్పటి నుంచి ఆ కుటుంబంపై కక్ష పెంచుకున్నారు. పురుషోత్తంను ఎలాగైనా మట్టుబెట్టాలని నిశ్చయించుకున్నారు. విషయం తెలుసుకున్న నాగరాజు తన తమ్ముడు పురుషోత్తంను బెంగళూరుకు పంపించేశాడు. ఈ క్రమంలో తీవ్ర ఆవేశానికి లోనైన చాణక్యప్రతాప్, రిపుంజయ తొలుత నాగరాజును అంతం చేయాలని ప్రణాళిక రచించారు.

బతిమాలినా వారి మనస్సు కరగలేదు

రాజీ పేరుతో నాగరాజు, చాణక్యప్రతాప్ సన్నిహితుడు గోపి రంగంలోకి దిగాడు. నాగరాజుకు శనివారం సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత నాగరాజు, చాణక్యప్రతాప్, రిపుంజయ, గోపితో పాటు మరి కొంతమంది చంద్రగిరి సమీపంలోని ఓ వెంచర్‌లో మద్యం సేవించినట్లు తెలుస్తోంది. రాత్రి 10.30 గంటలకు అక్కడి నుంచి నాగరాజు కారులో రిపుంజయతో పాటు మరో ఇద్దరు, మరో కారులో చాణక్యప్రతాప్‌తో పాటు ఇంకో ఇద్దరు బ్రాహ్మణపల్లి నుంచి గంగుడుపల్లి కురువకణం వద్దకు బయల్దేరారు. అప్పటికే అక్కడ టీడీపీ బొప్పరాజుపల్లికి చెందిన మరో ముగ్గురు కారులో వచ్చి వేచి ఉన్నారు. కురవకణం వద్దకు చేరుకోగానే రిపుంజయ, చాణక్య పాటు వారి అనుచరులు నాగరాజుపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తనను వదిలిపెట్టాలని, నన్నేమీ చేయొద్దని నాగరాజు, చాణక్యప్రతాప్, రిపుంజయను కాళ్లుపట్టుకుని బతిమలాడాడు. పది నిమిషాల పాటు పెనుగులాట చోటుచేసుకున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో నాగరాజు మెడలోని బంగారు గొలుసు, పాదరక్షలు పక్కకు పడిపోయాయి. 10.45 గంటల సమయంలో ముందుగా అనుకున్నట్లే అక్కడ ఉన్న మరో ముగ్గురితో పాటు టీడీపీ నాయకులు నాగరాజు గొంతు లుంగీతో బిగించి చంపేశారు. ఆపై నోటికి ప్లాస్టర్‌ను అతికించి బలవంతంగా కారులో పడేశారు. ఆపై కారును కురవకణం లోయలో పడేసేందుకు యత్నించారు. అయితే కారు ముందు పెద్దరాయి అడ్డుగా ఉండడంతో కారు లోపల, బయట పెట్రోల్ పోసి నిప్పంటించారు. ప్రాణాలతో ఉన్న నాగరాజు సజీవ దహనమయ్యాడు. నాగరాజు దహనమయ్యాడని నిర్ధారించుకుని చాణక్యప్రతాప్, రిపుంజయ వారి అనుచరులతో రెండు కార్లలో ఘటనా స్థలం నుంచి వెళ్లిపోగా, గోపి మరో ప్రాంతానికి పారిపోయినట్లుగా ప్రచారం జరుగుతోంది.



కాలిపోయిన కారులో ఆనవాళ్లను సేకరిస్తున్న పోలీసు సిబ్బంది

హత్యలో సుమారు 10 మంది పాత్రదారులు?

సాఫ్ట్‌వేర్ నాగరాజును హత్యచేసిన ఘటనలో సుమారు 10 మంది పాల్గొన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాణక్యప్రతాప్, రిపుంజయ, గోపితో పాటు బొప్పరాజుపల్లికి చెందిన ముగ్గురు, చాణక్యప్రతాప్‌కు చెందిన ఇద్దరు అనుచరులు, రామచంద్రాపురం మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు ఈ హత్యాకాండలో పాలు పంచుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో నిందితులు

నాగరాజు సజీవ దహనం కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రధాన నిందితుల్లో ఒకరితో పాటు బొప్పరాజుపల్లికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రధాన నిందితుడైన చాణక్యప్రతాప్‌కు, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు సంజీవ్‌కు వరుసకు అన్న. ఈ క్రమంలో పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నట్లుగా తెలుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు చాణక్యప్రతాప్ నగరిలోని ఓ గెస్ట్‌హౌస్‌లో ఉన్నట్లుగా సమాచారం. సోమవారం చాణక్యప్రతాప్ కోసం పోలీసులు గాలిస్తున్న క్రమంలో రాజకీయ బలంతో తప్పించుకుని తిరుగున్నట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు.

స్వయం ఉపాధిపై మొగ్గు చూపాలి



పాఠ్యాంశ ప్రణాళికలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసులు

రేణిగుంట: 'ప్రస్తుత పరిస్థితుల్లో చదువుకున్న వారందరికీ ఉద్యోగాలు రావడం చాలా కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామీణ యువత స్వయం ఉపాధిపై మొగ్గుచూపాలి'అని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలిపారు. సోమవారం రాస్–కృషి విజ్ఞాన కేంద్రంలో 27 రోజుల వృత్తి నైపుణ్యతా శిక్షణా ముగింపు కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ తాము ఎంపిక చేసుకున్న వృత్తిని ఎంతో క్రమశిక్షణతో, జాగ్రత్తగా వ్యవహరిస్తే కచ్చితంగా ఎదుగుదల ఉంటుందని చెప్పారు. పుట్టగొడుగులు, పెరటి కోళ్ల పెంపకం శాస్త్రీయ పద్ధతిలో చేయడం మంచి ఆదాయకర మార్గమన్నారు. సేంద్రీయ విధానంలో ఉత్పత్తి చేసిన ఉత్పత్తి మార్కెట్‌లో మంచి ధర ఉందన్నారు. అనంతరం శిక్షణా అభ్యర్థుల కోసం రూపొందించిన పాఠ్యాంశ ప్రణాళికలను ఆవిష్కరించారు. శాస్త్రవేత్తలు శ్రీలత, సుధాకర్, అనూషా, పద్మజ, దివ్య, రాముకుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 152 కేంద్రాల్లో పరీక్షలు
- సకాలంలో చేరుకున్న విద్యార్థులు
- తొలిరోజు 249 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. గత అనుభవాల దృష్ట్యా అధికారులు చేపట్టిన పటిష్ట కార్యాచరణతో ఎటువంటి అవకతవకలు, విమర్శలకు తావులేకుండా పరీక్ష జరిగాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు విద్యార్థులందరూ సకాలంలో చేరుకున్నారు. పోలీస్ బందోబస్తు నడుమ ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలను సురక్షితంగా చేరవేశారు. తొలిరోజు పదోతరగతి పరీక్షలు కావడంతో విద్యార్థులు పలు దేవాలయాల వద్ద కిటకిటలాడారు. పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. 152 పరీక్ష కేంద్రాల్లో 26,854మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా వారిలో 249మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. వివిధ కారణాలతో పరీక్ష రాయలేని విద్యార్థులు, దివ్యాంగ విద్యార్థులకు స్రైబ్‌కు అనుమతి ఇచ్చారు.

పటిష్ట బందోబస్తు

ఈ ఏడాది కలెక్టర్, ఎస్పీలు సైతం పది పబ్లిక్ పరీక్షల నిర్వహణకు రంగంలోకి దిగారు. వారి ఆదేశాల మేరకు విద్యాశాఖాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలుచేశారు. బయటి వ్యక్తులు లోనికి వెళ్లకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఈ ఏడాది విద్యార్థులతో పాటు పరీక్ష నిర్వహణాధికారుల సెల్‌ఫోన్లను కేంద్రాల్లోకి నిషేధించడం విశేషం.

ఆకస్మిక తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్ల సిబ్బందితో పాటు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ పలు కేంద్రాలను సందర్శించి ఓయంఆర్ షీట్లు, పశ్నపత్రాలను పరిశీలించారు.

అర్బన్ ఎస్పీ తనిఖీ

తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి సోమవారం తిరుపతిలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. విమర్శలకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని సమస్యాత్మకమైన మూడు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అనుమానాస్పందంగా వ్యవహరిస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎస్పీ వెంట ఎస్‌బీ డీఎస్పీ సురేంద్రారెడ్డి, వెస్ట్ డీఎస్పీ నరసప్పలు ఉన్నారు.



తిరుపతిలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



తిరుపతిలో ఓ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



పరీక్షకు హాజరైన విద్యార్థులు

మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం


జయలక్ష్మి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి

తిరుపతి అర్బన్ : మిషన్ వాత్సల్య స్పాన్సర్‌షిప్‌కు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు సంరక్షణ లేని పిల్లలు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ పథకం కింద ఎంపికైన పిల్లలకు నెలకు రూ.4వేల చొప్పున అందిస్తారని వివరించారు. స్పాన్సర్‌షిప్ పొందేందుకు తల్లి వితంతువై ఉండాలని తెలిపారు. లేదా విడాకులు తీసుకుని ఉండాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలకు సంవత్సర ఆదాయం రూ.72 వేలు లోపు, పట్టణ ప్రాంతాలలోని పిల్లలకు రూ.96వేలు లోపు ఉండాలని ఆమె పేర్కొన్నారు.

● శేషాచలంలా వసంతమండపం


వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు


మలయప్ప స్వామికి హారతి

తిరుమలలో మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీవారి వసంతోత్సవాలకు వసంత మండపాన్ని శోభాయమానంగా అలంకరించారు. టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శేషాచల అడవులను తలపించేలా తీర్చిదిద్దారు. ఇందుకోసం 250 కేజీల వట్టి వేరు, 500 కేజీల సంప్రదాయ పుష్పాలు, 10 వేల అలంకరణ పుష్పాలతో సుందరంగా రూపొందించారు. పచ్చని చెట్లు, పలురకాల జంతువుల ఆకృతులను ఏర్పాటుచేశారు. ఇవి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

\- తిరుమల


తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,330
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,478
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,500
రిటైల్ వెండి గ్రాము	రూ.75.50

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	25
చిత్తూరు	36	24
తిరుమల	32	21
గూడూరు	38	27
నగరి	37	26

తుంబురు తీర్థ ముక్కోటికి ఆర్టీసీ బస్సులు

తిరుమల: తిరుమలలో ఈనెల 5, 6 తేదీల్లో జరగనున్న తుంబురుతీర్థ ముక్కోటికి పాపవినాశనం వద్ద పార్కింగ్ సమస్య దృష్ట్యా తిరుమల, గోగర్భం డ్యాం సర్కిల్ నుంచి భక్తుల రాకపోకలకు ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. భక్తులు, ట్యాక్సీ డ్రైవర్లు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్ : పట్టణ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్ కాలనీ సమీపంలో రైలు పట్టాల వద్ద ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పండి ఆత్మహత్య చేసుకున్నట్లు గూడూరు రైల్వే ఎస్‌ఐ కొండప్పనాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాయుడుపేట పట్టణ పరిధిలోని ఎస్‌ఎస్‌ఆర్ కాలనీ వద్ద సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం రాత్రి చెన్నై వైపు వెళుతున్న హౌరా మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతి చెందినట్లు రైలు లోకో పైలట్ శివాజీ నాయుడుపేట స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. మృతుడు గోధుమ రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, తెలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పన్ను వసూళ్లలో తిరుపతి ఫస్ట్


అభినందనలు తెలుపుతున్న మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్

తిరుపతి తుడా: వివిధ పన్నుల వసూళ్లలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి ఆర్వో కేఎల్ వర్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నగర మేయర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి సమావేశమయ్యారు. ఆస్తి పన్నుల వసూళ్లలో గతానికి భిన్నంగా వ్యవహరించి తిరుపతిని అగ్రస్థానంలో నిలపడంలో రెవెన్యూ సిబ్బంది కృషి ప్రశంసనీయమని కొనియాడారు. తిరుపతి నగరంలోని 68,913 ఆస్తులకు సంబంధించి రావాల్సిన పన్నులు, బకాయిలు రూ.65,92,72,936 ఉండగా రూ. 63,26,88,793 కోట్లను రాబట్టారని తె లిపారు. 96 శాతం మేర వసూళ్లు చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, సూరిబాబు, జ్యోతీశ్వర్, రాజశేఖర్, శంకరయ్య, శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్, నవీన్‌ను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి అభినందించారు.

జీవితాంతం జగనన్న వెంటే


పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

కోట: జీవితాంతం ముఖ్యమంత్రి జగనన్న వెంటే నడుస్తానని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా సోషల్‌మీడియా, కొన్ని పత్రికల్లో తనగురించి అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, వారిపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సోమవారం కోట ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం కోట పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి జగనన్న వెంట నడుస్తూ పార్టీ కోసం పనిచేశానన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా తనపై అనేక కేసులు బనాయించినా భయపడలేదని, అప్పటి మంత్రి తన వ్యాపార కార్యకలాపాలను సైతం దెబ్బతీశారని తెలిపారు. నాడు జగనన్న వెంటే నడిచానే తప్ప కేసులకు భయపడి టీడీపీలోకి పోలేదన్నారు. 2019లో అధికారంలోకి వచ్చాక జగనన్న తమ కుటుంబంపై ఎంతో అభిమానం చూపించారని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవి ఇవ్వడంతో పాటు తన సతీమణి పేర్నాటి హేమసుస్మితను ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా చేశారని గుర్తుచేశారు. అదేవిధంగా తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చారని, దురదృష్టవశాత్తు ఓటమి చెందినా ప్రజల తీర్పును స్వాగతిస్తున్నానన్నారు. ఈ జన్మలో జగనన్నను వీడే ప్రసక్తే లేదన్నారు. 2024లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ శేషయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాదర్తి రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు సాగర్‌రెడ్డి, సాయిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్, మల్లికార్జునరెడ్డి, మొయిన్, కిషోర్‌రెడ్డి ఉన్నారు.

యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా తోయజాక్ష



ఏర్పేడు: జాతీయ చేనేత ఐక్యవేదిక యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన మేకలత్తూరు తోయజాక్ష నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు సుంకర చిన్నరెడ్డిబాబు సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

తిరుచానూరు(చంద్రగిరి) : లారీ-ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాల మేరకు... అడపారెడ్డిపల్లి నుంచి ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో తిరుపతికి పయనమైంది. వేదాంతపురం కూడలి దాటుతున్న క్రమంలో చంద్రగిరి నుంచి తిరుచానూరుకు వెళ్తూ రోడ్డు దాటుతున్న బస్సును ఓ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని పక్కకు వాలిపోయింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి బస్సు వద్దకు చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ప్రయాణికులందరికీ స్వల్పగాయాలు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో రోడ్డుకు అడ్డుగా పడి ఉన్న బస్సును పక్కకు తీశారు. అనంతరం ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవరును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

డైకిన్ పరిశ్రమలో చోరీ

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఏసీలు తయారు చేసే డైకిన్ పరిశ్రమలో కాపర్ పైపులు చోరీకి గురయ్యాయి. దీనిపై పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో దర్యాప్తు చేశారు. అక్కడే పరిశ్రమలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న వారే ఈ చోరీకి పాల్పడినట్లు విచారణలో గుర్తించారు. వరదయ్యపాళెం మండలం, కుప్పటతాగేలికి చెందిన బెల్లంకొండ వెంకటేష్, కాకి వెంకటేష్, వెంకటయ్య, శేఖర్, పోలయ్య, రారాజు, గోవిందు, శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి వారి నుండి రూ.లక్ష ఎనభైవేల విలువ చేసే 200 మీటర్ల కాపర్ పైపులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వారిని సత్యవేడు కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

వేడుకగా ప్రదోష పూజలు


సురుటపల్లి పల్లికొండేశ్వరాలయంలో శివపార్వతుల ప్రాకారోత్సవం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం, సురుటపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయంలో త్రయోదశిని పురస్కరించుకొని ప్రదోష పూజలు సోమవారం వేడుకగా నిర్వహించారు. పక్షం రోజులకు ఒక సారి వచ్చే త్రయోదశి నాడు ఈ ఆలయంలో శివునికి ప్రీతిమంతుడైన నందీశ్వరునికి ప్రదోష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలోని స్వయంభూ శ్రీవాల్మీకేశ్వర స్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో నందీశ్వరుని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శభాగ్యం కల్పించారు. వివిధ రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ నైవేద్యం సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో కొలువుదీరిన శ్రీ మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత శ్రీపల్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తుకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, సభ్యులు మునివేలు, ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. పూజల్లో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పాలపద్మనాభం పాల్గొన్నారు.